మనం
హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
ఆదివారం | 20 | సెప్టెంబర్ | 2026 పేజీలు: 10

# కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతర పర్యవేక్షణ



## భారీ వర్షాలు, గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష






2

హైదరాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్) : రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్లి హైదరాబాద్ నగరంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు.

# శిల్పారామంలో పూంపుహార్ మెగా హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో ప్రారంభం

తమిళనాడు వైవిధ్యమైన సాంప్రదాయ హస్తకళల ప్రదర్శన

ఈ నెల 23 వరకు అందుబాటులో ఉండనున్న అద్భుతమైన హస్తకళా ఉత్పత్తులు





3

# పీ.జీ. లా కాలేజీలో ఓరియంటేషన్ కార్యక్రమం




విద్యార్థులు ప్రాథమిక న్యాయ సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలి.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి కార్యదర్శి ఏ. శ్రీదేవి

3

హైదరాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్) :హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పీ.జీ. లా కాలేజీలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్ కార్యదర్శి ఏ. శ్రీదేవి అన్నారు.

# సమ్మె నోటీసు ఉపసంహరించుకున్న ట్యాంకర్ అసోసియేషన్

2



# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

డ్రెనేజీలను వెంటనే క్లియర్ చేయాలి..

ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

అత్యవసర పరిస్థితులకు వేగంగా స్పందించాలి: సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, సెప్టెంబర్ 19: రాష్ట్రంలో భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులతో పరిస్థితిని సమీక్షించారు.

2

# కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతర పర్యవేక్షణ











## భారీ వర్షాలు, గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్) : రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్లి హైదరాబాద్ నగరంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. భారీ వర్షాలతో పాటు నగరంలో జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రకు చేపట్టిన ఏర్పాట్లను కూడా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిశీలించారు. గణేష్ శోభాయాత్ర ప్రారంభమయ్యే బాలాపూర్‌తో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో రహదారుల పరిస్థితి, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నీరు నిలిచే ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు తదితర ఏర్పాట్లను సీఎస్ పరిశీలించారు.టీ-జీఐసీసీసీ ఇన్చార్జ్ అధికారి కమల్ హాసన్ రెడ్డి సీఎస్‌కు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరుగుతున్న రియల్‌టైం పర్యవేక్షణ, వివిధ ప్రాంతాల్లో పరిస్థితులపై అందుతున్న సమాచారం, శోభాయాత్ర మార్గాల్లో చేపట్టిన నిఘా ఏర్పాట్లను వివరించారు. శోభాయాత్ర మార్గాల్లో సీసీ కెమెరాల ద్వారా చేపడుతున్న నిఘా, పర్యవేక్షణ ఏర్పాట్లను కూడా సీఎస్ పరిశీలించారు. కీలకమైన ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో నిఘాను మరింత పటిష్టం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని,



అవసరమైన చోట్ల వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. దెబ్బతిన్న రోడ్లకు అవసరమైన మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాల కారణంగా శోభాయాత్రకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. గణేష్ శోభాయాత్ర సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్, వైద్య, అత్యవసర సేవలను సమన్వయంతో అందుబాటులో ఉంచాలని సీఎస్ సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితులను రియల్‌టైమ్‌లో నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు స్పందించేలా సమన్వయం చేసుకోవాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. భారీ వర్షాలు, గణేష్ నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలను తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**డ్రైనేజీలను వెంటనే క్లియర్ చేయాలి..**

**ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**అత్యవసర పరిస్థితులకు వేగంగా స్పందించాలి: సీఎస్ సంజయ్ జాజు**



హైదరాబాద్, సెప్టెంబర్ 19: రాష్ట్రంలో భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, పోలీస్ కమిషనరేట్ల ఉన్నతాధికారులతో వర్షాల నేపథ్యంలో చేపట్టిన ముందస్తు చర్యలు, సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు.వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో ఉండాలని సీఎస్ ఆదేశించారు. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షించాలని, నీరు నిలిచే ప్రాంతాల్లో డ్రైనేజీలను వెంటనే క్లియర్ చేయాలని సీఎస్ అధికారులకు సూచించారు. వర్షాల కారణంగా నగరంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే వేగంగా స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ స్పష్టం చేశారు.తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సమాచారం ప్రకారం, భారీ వర్షాల నేపథ్యంలో రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు,ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని,గంటకు 40 కిలోమీటర్ల వరకు ఉపరితల గాలులు వీచే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు, ఫీల్ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎస్ అధికారులకు సూచించారు. వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సమ్మె నోటీసు ఉపసంహరించుకున్న ట్యాంకర్ అసోసియేషన్

**ఎండీ హామీతో సమ్మె నిర్ణయం విరమించుకున్నాం**

**ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలు యథావిధిగా కొనసాగిస్తాం**

**ట్యాంకర్ ఓనర్ అసోసియేషన్‌ల అధ్యక్షుల స్పష్టీకరణ**



హైదరాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్):హైదరాబాద్‌లో ట్యాంకర్‌ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్న నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలు, ట్యాంకర్ రేట్ల పెంపునకు సంబంధించిన డిమాండ్‌పై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ట్యాంకర్ అసోసియేషన్ అధ్యక్షులు తెలిపారు. ఎండీ ఇచ్చిన హామీ నేపథ్యంలో ప్రతిపాదిత సమ్మె నిర్ణయాన్ని విరమించుకుని, ట్యాంకర్ సేవలను యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించినట్లు వారు వెల్లడించారు.

శనివారం మూడు ట్యాంకర్ ఓనర్ అసోసియేషన్‌ల అధ్యక్షులు జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ట్యాంకర్ల నిర్వహణ వ్యయం పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం చెల్లిస్తున్న రేట్లను సవరించాలని ఇప్పటికే లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.తమ వినతిపై ఎండీ సానుకూలంగా స్పందించారని అసోసియేషన్‌ల అధ్యక్షులు తెలిపారు. ట్యాంకర్ రేట్ల పెంపు ప్రతిపాదనను తదుపరి బోర్డు సమావేశంలో చర్చించి అవసరమైన ఆమోద ప్రక్రియ చేపడతామని, తుది నిర్ణయం ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సి ఉన్నందున ఈ అంశాన్ని బోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎండీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.నిన్నటివరకూ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముఖ్యమంత్రి.. ఇతర ఉన్నతాధికారులు బిజీగా ఉన్నారని, వీలైనంత త్వరగా ప్రభుత్వ దృష్టికి ట్యాంకర్ నిర్వాహకుల సమస్యను ప్రత్యేకంగా వివరించి రేట్ల సవరణకు కృషి చేస్తామని ఎండీ తెలిపినట్లు చెప్పారు. తమ సమస్యలపై ఎండీ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించి, పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చారని.. తాగునీరు అత్యవసర ప్రజా అవసరం కావడంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం మా ఉద్దేశం కాదని అన్నారు. ఎండీ హామీని గౌరవిస్తూ సమ్మె నిర్ణయాన్ని విరమించుకుంటున్నామని, ట్యాంకర్ సేవలను యథావిధిగా కొనసాగిస్తూ జలమండలికి పూర్తి సహకారం అందిస్తామని వారు వెల్లడించారు. ప్రభుత్వం కూడా తమ న్యాయమైన విజ్ఞప్తిని సానుకూలంగా పరిష్కరిస్తుందని ఆశిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడులు పేర్కొన్నారు.ట్యాంకర్ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపి, తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డికి అసోసియేషన్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జివిజి నాయుడు, ఉపాధ్యక్షుడు సంపత్ రావు, గ్రేటర్ హైదరాబాద్ వాటర్ ట్యాంకర్స్ అసోసియేషన్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్,అధ్యక్షుడు అక్బర్ హుస్సేన్ , హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ వాటర్ ట్యాంకర్ ఓనర్స్ యూనియన్, ఇమ్రాన్ ఖాన్ కార్యదర్శి, స్టేట్ మోటార్ ట్రాన్స్ పోర్ట్ ఆపరేటర్స్ అసోసియేషన్ లతో పాటు యూనియన్ల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పీ.జీ. లా కాలేజీలో ఓరియంటేషన్ కార్యక్రమం

**విద్యార్థులు ప్రాథమిక న్యాయ సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలి.**

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి కార్యదర్శి ఏ. శ్రీదేవి**




హైదరాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్) :హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పీ.జీ. లా కాలేజీలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్ కార్యదర్శి ఏ. శ్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ న్యాయ విద్య అనేది కేవలం న్యాయశాస్త్ర పరిజ్ఞానాన్ని పొందడం మాత్రమే కాకుండా, సమాజంలో న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువలను పరిరక్షించే బాధ్యతను కూడా కలిగి ఉంటుందని తెలిపారు.ప్రతి న్యాయ విద్యార్థి ప్రాథమిక న్యాయ సూత్రాలతో పాటు ప్రస్తుత న్యాయ వ్యవస్థలో జరుగుతున్న మార్పులు, కొత్త చట్టాలు అలాగే న్యాయపరమైన పరిణామాలపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. న్యాయవృత్తిలో నిజాయితీ, నైతిక విలువలు, క్రమశిక్షణ , సామాజిక బాధ్యత ఎంతో ముఖ్యమైనవని శ్రీదేవి పేర్కొన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన వ్యక్తులకు అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, న్యాయ అవగాహన కార్యక్రమాలు, న్యాయ సేవా శిబిరాలు, లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం అలాగే ప్రీ-లిటిగేషన్ సేవలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు,ఇతర అర్హులైన వ్యక్తులకు న్యాయ సహాయం అందించడంలో న్యాయ విద్యార్థులు, భవిష్యత్ న్యాయవాదులు తమ వంతు సహకారం అందించాలని ఆమె సూచించారు. న్యాయ విద్యార్థులు తమ విద్యా దశ నుంచే ప్రజలతో మమేకమై, న్యాయపరమైన సమస్యలను అర్థం చేసుకుని, ప్రజల్లో వారి హక్కులు,న్యాయ సేవలపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, న్యాయ విద్యార్థులు కోర్టు విధానాలు, న్యాయ ప్రక్రియలు,ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలపై ప్రాక్టికల్ అవగాహన పెంపొందించుకోవడం ద్వారా తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీ.జీ. లా కాలేజీ ప్రిన్సిపాల్ అపర్ణ, లా సెట్ కన్వీనర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్ పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా**



హైదరాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్): జిల్లాలో అర్హులైన బి.సి. మహిళలు ప్రభుత్వం ఉచితంగా అందించే కుట్టుమిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న కుట్టు మిషన్ల పథకానికి నిరుద్యోగ మహిళలు ముఖ్యంగా నిరాశ్రయులు, ఒంటరి మహిళలు, వితంతువులు అలాగే అనాథ మహిళలు అర్హులని తెలిపారు. జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 15 నియోజకవర్గాలకు 15 వేల ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఒక్కో మిషన్ విలువ రూ.12వేలు కలదని, దీనిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. అలాగే 18 నుంచి 55 ఏళ్లలోపు వయసు కలిగిన మహిళలు ఈనెల 30లోగా 'టీజీఓబీఎంఎంఎస్' ఆన్‌లైన్ పోర్టల్లో దర ఖాస్తు చేసుకోవాలని, కనీస విద్యార్హత 5వ తరగతి వరకు ఉండాలని ఆమే తెలిపారు. టైలరింగ్ సర్టిఫికెట్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

# శిల్పారామంలో పూంపుహార్ మెగా హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో ప్రారంభం

**తమిళనాడు వైవిధ్యమైన సాంప్రదాయ హస్తకళల ప్రదర్శన**

**ఈ నెల 23 వరకు అందుబాటులో ఉండనున్న అద్భుతమైన హస్తకళా ఉత్పత్తులు**



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): తమిళనాడు హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (పూంపుహార్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పారామంలో 'మెగా హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్పో' అట్టహాసంగా ప్రారంభమైంది. శనివారం జరిగిన ఈ ఎక్స్పో ప్రారంభోత్సవానికి తమిళనాడు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి పి. మధన్ రాజా ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమిళనాడులోని వివిధ జిల్లాలకు చెందిన నైపుణ్యం కలిగిన కళాకారులు తయారు చేసిన అద్భుతమైన హస్తకళా ఉత్పత్తులను నగర ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా తమిళనాడు వైవిధ్యమైన సాంప్రదాయ హస్తకళా వారసత్వాన్ని ప్రజలకు పరిచయం చేస్తున్నామని మంత్రి వివరించారు.

శనివారం ప్రారంభమైన ఈ మెగా ఎక్స్పో ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనుంది. తమిళనాడు హస్తకళల అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ మేనేజర్ (సేల్స్) సి. గోపికన్నన్ మట్లాడుతూ ఈ ప్రదర్శనలో కాంస్య విగ్రహాలు, ఇత్తడి సంప్రదాయ దీపాలు, ప్రసిద్ధ తంజావూరు చిత్రాలు, తంజావూరు ఆర్ట్ ప్లేట్లు, పేపియర్-మాచే బొమ్మలు, చెక్కరాతి శిల్పాలు, ఇత్తడి కళాఖండాలు, టెర్రకోట ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అలాగే కేన్ ఫర్నిచర్, అరటి నార, జనపనార (జ్యూట్), తాటి ఆకుల ఉత్పత్తులు, ఫ్యాషన్ ఆభరణాలు, ధూప-సుగంధ ద్రవ్యాలు, హస్తకళా వస్త్రాలు, చేనేత వస్తువులు తదితర ఎన్నో సాంప్రదాయ ఉత్పత్తులు కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తమిళనాడు హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. అమృత జ్యోతి, పూంపుహార్ అసిస్టెంట్ మేనేజర్ సి. గోపికన్నన్ తదితరులు పాల్గొన్నారు. నగరవాసులు, కళా ప్రియులు ఈ ప్రదర్శనను సందర్శించి అరుదైన హస్తకళాఖండాలను తిలకించాలని నిర్వాహకులు కోరారు.



















# రోడ్డు లేని ఫంక్షన్ హాల్‌కు అనుమతులా?

**హెచ్ ఎం డి ఎ లీలలు**

**సెట్ బ్యాక్ లేదు.. రోడ్డు లేదు... అయినా అనుమతులు**

**చివరకు హైకోర్టు జోక్యం**



మేడ్చల్, సెప్టెంబర్ 19 : ( మనం జిల్లా ప్రతినిధి ): ఆ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రోడ్డే లేదు... సెట్ బ్యాక్ ఏ మాత్రం లేదు. అయినా హెచ్ఎండిఏ అధికారులు అనుమతులు ఇచ్చారట.

ఏదైనా నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలంటే దానికి కచ్చితంగా రోడ్డు ఉండాల్సి ఉంటుంది. అంతేకాకుండా సెట్ బ్యాక్ చేసి నిర్మాణాన్ని సాగిస్తేనే హెచ్ఎండిఏ అనుమతులు ఇస్తుంది. కానీ మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో కండ్లకోయ శివారులోని 226/ ఎ ఎ

సర్వే నెంబర్ లో ఒక ఎకరం 34 గుంటల స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మాణం సాగుతుంది. ఈ ఫంక్షన్ హాల్ కు వెళ్లడానికి సరైన మార్గం లేదు. సెట్ బ్యాక్ అంటూ ఏమీ లేదు. నిర్మాణం మాత్రం కొనసాగుతుంది. ఆ ఫంక్షన్ హాల్ యజమాని మాత్రం తనకు హెచ్ఎండిఏ అనుమతులు ఉన్నాయి అంటూ చెప్పుకుంటూ నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. గత 2023 ఎన్నికల ముందు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం, హెచ్ఎండిఏ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి అనుమతులు ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చారని. రోడ్డు ఉందా... స్టేట్ బ్యాంక్... అన్న నిబంధనలను చూడకుండా అనుమతుల కోసం హెచ్ఎంబీఏ కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి అనుమతులు ఇచ్చారని. దీనిని ఆసరా చేసుకొని సదరు ఫంక్షన్ హాల్ యజమాని అనుమతులు తీసుకొని ఉండి ఉంటారని పలువురు భావిస్తున్నారు. అయితే ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్ నిర్మాణం సాగుతుందని ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ సైతం చేశారు.

ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసినప్పటికీ మళ్లీ యధావిధిగా నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు.

**ఈ అక్రమ ఫంక్షన్ హాల్ నిర్మాణం పై అధికారులకు ఫిర్యాదులు**

ఈ అక్రమ ఫంక్షన్ హాల్ నిర్మాణం పై అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సైబరాబాద్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కు, మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు అప్పన్న గారి రామిరెడ్డి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఈ అక్రమ ఫంక్షన్ హాల్ పై హైకోర్టులో సైతం పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు అక్రమ ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి అంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా నిర్మాణ పనులు ఆగకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద సదరు రాంరెడ్డి అధికారులకు సైతం నోటీసులు పంపినట్టు సమాచారం.

**విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ చర్యలు శూన్యం**

ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం సదరు ఫంక్షన్ హాల్ యజమాని విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ విద్యుత్ చౌర్యంపై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదులు సైతం వెళ్లిన తూతూ మంత్రంగా విచారణ జరిపి...

అబ్బే అలాంటిది ఏమీ లేదు అంటూ... చేతులు దులుపుకొని వెళ్లారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే దాదాపు సంవత్సరం పాటు విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ విద్యుత్ శాఖ అధికారులు దీని వైపు కన్నెత్తి చూడకపోవడం పై అప్పట్లో జోరుగా ఆరోపణలు వినిపించాయి. ఫంక్షన్ హాల్ యజమానికి విద్యుత్ శాఖ అధికారుల మధ్య కుదిరిన ఒప్పందంతోనే విద్యుత్ శాఖ అధికారులు ఈ ఫంక్షన్ హాల్ పై చర్యలు తీసుకోలేదని అప్పట్లో ఆరోపణలు జోరుగా వినిపించాయి.

---

# కాసా గ్రాండ్ డెవలపర్స్ తీరుపై ఏజీ కాలనీ వాసుల ఆరోపణలు

**రోడ్లు, డ్రైనేజీ ధ్వంసం చేశారని ఆవేదన..**

**11 కేవీ లైన్తో ప్రమాదం పొంచి ఉందని వెల్లడి..**



మేడ్చల్, సెప్టెంబర్ 19 ( మనం జిల్లా ప్రతినిధి ): గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని ఏజీ కాలనీ వాసులు కాసా గ్రాండ్ డెవలపర్స్ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. డెవలపర్స్ చేపడుతున్న పనుల కారణంగా కాలనీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మీడియాకు తెలిపారు. కాసా గ్రాండ్ డెవలపర్స్ కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ మ్యాన్హోల్స్ను ధ్వంసం చేశారని, ప్లాట్ల హద్దులను సూచించే హద్దురాళ్లను తొలగించారని కాలనీ వాసులు ఆరోపించారు. అంతేకాకుండా నిత్యం టిప్పర్ లారీల ద్వారా మట్టిని తరలిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. కాలనీ పరిధిలో సరైన విద్యుత్ అనుమతులు లేకుండానే 11 కేవీ విద్యుత్ లైన్ను ప్రమాదకరంగా ఏర్పాటు చేశారని వారు ఆరోపించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో విద్యుత్ లైన్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగితే చర్యలు తీసుకోవాలని ఏజీ కాలనీ వాసులు కోరారు. కాలనీ ప్రజల భద్రతకు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీ కాలనీ అధ్యక్షులు నాగేశ్వరరావు, సెక్రెటరీ ఏపీ రావు, వైస్ ప్రెసిడెంట్ పద్మా రెడ్డి, జాయింట్ సెక్రెటరీ సుభాష్ రెడ్డి, ట్రెజరర్ జయసినారెడ్డి కమిటీ మెంబర్స్ ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ ఫంక్షన్ హాల్ మరోసారి సీజ్



**మనం దినపత్రిక ఎఫెక్ట్**

మేడ్చల్, సెప్టెంబర్ 19: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధి కండ్ల కోయ శివారులోని 226/ ఎ ఎ సర్వే నెంబర్లు అక్రమంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు. ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని ఆపాలి అంటూ హైకోర్టు ఆదేశాలు అని మనం దినపత్రికలో వచ్చిన కథనానికి

టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. అక్రమంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని ఆపాలి అంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు సంబంధిత ఫంక్షన్ హాల్ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని గతంలో సైతం సీజ్ చేయడం జరిగిందని మళ్లీ ఎలా నిర్మాణం చేపడతారు అంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. మీ దగ్గర ఉన్న అనుమతుల పత్రాలను చూపించి నిర్మాణం చేపట్టుకోవాలని, ఎలాంటి పత్రాలు చూపించని పక్షంలో నిర్మాణం కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. కోర్టు ఆదేశాలు ఉండగా నిర్మాణాన్ని ఎలా సాగిస్తున్నారు అంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు సీరియస్ అయినట్లు సమాచారం.

**సమగ్ర విచారణ జరిపించాలి**

ఇదేవిధంగా అక్రమ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మనం ఎఫెక్ట్

# ఓయూలో అక్టోబర్ 4న మాల విద్యార్థి, నిరుద్యోగ సభ

**ఆర్ట్స్ కాలేజీలో పోస్టర్ ఆవిష్కరణ.. రోస్టర్ విధానంపై ఆందోళన సభను విజయవంతం చేయాలని ప్రొ. లింబాద్రి, మందాల భాస్కర్ పిలుపు..**



సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) మాల స్టూడెంట్స్ జేఏసీ, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా), ఐక్య విద్యార్థి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో 'మాల విద్యార్థి, నిరుద్యోగ సభ' పోస్టర్ను శుక్రవారం ఆవిష్కరించారు. అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి మహాసభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం అమలుతో మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు నష్టం జరుగుతోందని నిర్వాహకులు ఆరోపించారు. ఇప్పటివరకు వెలువడిన 25 నోటిఫికేషన్ లలో రోస్టర్ విధానం కారణంగా పలు పోస్టులు మాల వర్గానికి దక్కలేదని వారు పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజాసంఘాలను ఏకం చేసి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం 2025లో చట్టపరమైన చర్యలు చేపట్టింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హయ్యర్ ఎడ్యుకేషన్ మాజీ చైర్మన్ ప్రొ. లింబాద్రి, మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, ప్రొ. మాయాదేవి హాజరై మాట్లాడారు. మాల సామాజిక వర్గానికి సంబంధించిన సమస్యలపై గళమెత్తడంతో పాటు అక్టోబర్ 4న నిర్వహించే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాల స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్, అంసా ఓయూ ప్రెసిడెంట్ నామ సైదులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీల విద్యార్థి నాయకులు, జిల్లాల బాధ్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సభకు మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, నిరుద్యోగులు, మాల సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరకు రాంచంద్రం, బేర బాల కిషన్, గోపోజు రమేష్, ప్రొ. వెంకటేశ్వర్లు, సత్యం, మాస శేఖర్, రాంబాబు, అడ్వకేట్ నర్సింగం, ప్రణయ్ సేపూరి, పసరగొండ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్త పల్సర్ 150, 125 సీసీ బైకుల ఆవిష్కరణ

**- షాబాద్ ఉప సర్పంచ్ దండు రాహుల్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరణ**

మనం న్యూస్ // షాబాద్, సెప్టెంబర్ 20: షాబాద్ మండల కేంద్రంలోని హరూన్ బజాజ్ షోరూమ్ ఆధ్వర్యంలో నూతన బజాజ్ పల్సర్ 150, 125 సీసీ బైకులను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి షాబాద్ ఉప సర్పంచ్ దండు రాహుల్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై నూతన బైకులను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా షోరూమ్ సిబ్బంది మాట్లాడుతూ.. నూతన పల్సర్ 150, 125 సీసీ మోడళ్ల ధరలు, ప్రత్యేక ఫీచర్లు, మైలేజ్ తదితర వివరాలను వినియోగదారులకు వివరించారు. ఆసక్తి ఉన్నవారు షోరూమ్లో టెస్ట్ డ్రైవ్ ద్వారా బైకుల పనితీరును తెలుసుకోవచ్చని తెలిపారు. బజాజ్ ద్విచక్ర వాహన ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షోరూమ్ సిబ్బంది, గ్రామస్తులు, బైక్ వినియోగదారులు పాల్గొన్నారు.



## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**బొల్లారం-ఎల్సీ గేట్ మధ్య ఘటన.. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి..**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) సికింద్రాబాద్ రైల్వే పరిధిలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం శనివారం ఉదయం 9.30 గంటలకు ముందు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ డిప్యూటీ ఎస్ఎస్కు ఎంఎంటిఎస్ రైలు లోకో పైలట్ పట్టాలపై వ్యక్తి మృతిచెందినట్లు సమాచారం అందించారు. దీంతో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బొల్లారం-ఎల్సీ గేటు మధ్య పట్టాలపై సుమారు 45-50 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు రావడాన్ని గమనించకపోవడంతో ఢీకొని అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు తెల్లటి టీషర్ట్, మెరూన్ రంగు నిక్కరు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440083160, 8712658581 నంబర్ లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## కెంట్ యూనివర్సిటీతో ఓయూ విద్యా, పరిశోధన భాగస్వామ్యంపై చర్చలు

**అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి.. సంయుక్త పరిశోధనపై కసరత్తు..**

**అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడమే లక్ష్యం: వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం..**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కెంట్ మధ్య విద్యా, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారానికి అవకాశాలను అన్వేషిస్తూ శుక్రవారం సమావేశం జరిగింది. కెంట్ బిజినెస్ స్కూల్ (కేబిఎస్) డీన్ ప్రొఫెసర్ విక్కీ నైట్, ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం అధ్యాపకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, ఇరు విశ్వవిద్యాలయాల స్థాయిలో విస్తృత సహకారానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఇరు సంస్థల మధ్య అధ్యాపకుల పరస్పర అనుసంధానం (ఫ్యాకల్టీ మ్యాచింగ్) చేపట్టడం ద్వారా అర్థవంతమైన విద్యా భాగస్వామ్యాలను అభివృద్ధి చేయాలని వీసీ ప్రొఫెసర్ కుమార్ ఆకాంక్షించారు. ప్రతిపాదిత సహకారాన్ని కార్యరూపంలోకి తీసుకెళ్లేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ టు వీసీ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్, ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ వి. జహంగీర్, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, రూసా నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ శ్రీనివాసులు సి. తదితరులు పాల్గొన్నారు.



## అంతారం శివారులో విషాదం.. బాలుడి ఆత్మహత్య

**అంతారం గ్రామ శివారులో విషాద ఘటన**



మనం న్యూస్ // షాబాద్, సెప్టెంబర్ 20: షాబాద్ మండలంలోని అంతారం గ్రామ శివారులో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జిట్టా చంద్రశేఖర్ (16) ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

చంద్రశేఖర్ తండ్రి లక్ష్మయ్య గొర్రెల కాపరిగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైనట్లు ప్రాథమికంగా సమాచారం. ఈ క్రమంలో గ్రామ శివారులోని పంట పొలాల్లో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిసింది.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# సింగిరెడ్డి మాధవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కర్రే రాజేష్**




ఘట్కేసర్ మనం న్యూస్ సెప్టెంబర్ 19: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షులు, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తండ్రి, సింగిరెడ్డి మాధవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రే రాజేష్ మాధవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కర్రే రాజేష్ మాట్లాడుతూ.. సమాజం పట్ల బాధ్యతతో పనిచేసిన సింగిరెడ్డి మాధవరెడ్డి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజలతో మమేకమై, సమాజ శ్రేయస్సు కోసం పనిచేసిన వారి సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజాసేవకు అంకితమైన వ్యక్తుల ఆశయాలను నేటి తరం కొనసాగించాలని, వారి సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని కర్రే రాజేష్ అన్నారు. మాధవరెడ్డి కుటుంబ సభ్యులకు, ఆయనను అభిమానించే ప్రతి ఒక్కరికీ ఆయన వర్ధంతి సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని, గౌరవాన్ని వ్యక్తం చేశారు.

**కుటుంబానికి అండగా కాంగ్రెస్ నాయకులు**

సింగిరెడ్డి మాధవరెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

మాధవరెడ్డి సేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు తమ సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.



## సోదరభావం మతసామరస్యానికి నిదర్శనంగా కార్యక్రమం

**ముస్లిం సోదరుడు అబ్దుల్ ఘని కొనియాడిన నాయకులు**

**భారీగా పాల్గొన్న భక్తులు, గ్రామ ప్రజలు**

చేవెళ్ల, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 1, 2వ వార్డుల ఊరెళ్ల వినాయక మండపం వద్ద మతసామరస్యాన్ని చాటిచెప్పే విధంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ మహమ్మద్ జాంగిర్, మాజీ వైస్ ఎంపీపీ కర్ని శివప్రసాద్, కుంచెం కుమార్ గుప్తా ఆధ్వర్యంలో ముస్లిం సోదరుడు అబ్దుల్ గని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.కార్యక్రమానికి చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్రెడ్డి, మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. హిందువుల ఆధ్యాత్మిక పండుగ అయినటువంటి వినాయక చవితి సందర్భంగా ముస్లిం సోదరుడు అబ్దుల్ గని ముందుకు వచ్చి భక్తులకు అన్నప్రసాదం అందించడం సోదరభావం, మతసామరస్యం, మానవత్వానికి నిదర్శనంగా నిలిచిందని పలువురు కొనియాడారు.కులమతాలకు అతీతంగా సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## బీటెక్ విద్యార్థిని మృతి.. వరకట్న వేధింపుల ఆరోపణలు

**వివాహం జరిగిన కొద్దిరోజులకే విషాదం.. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు**

ఘట్కేసర్ మనం న్యూస్ సెప్టెంబర్ 19: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బీటెక్ విద్యార్థిని పల్లవి (20) మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఘన్పూర్లోని కేపీఆర్ఐటీ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న పల్లవి చికిత్స పొందుతూ మృతిచెందింది. వివాహం జరిగిన కొద్దిరోజులకే ఆమె తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘట్కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన ఏనుగు మధుసూదన్రెడ్డి కుమార్తె పల్లవి. ఉన్నత విద్యను అభ్యసిస్తూ తన భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆమె కేపీఆర్ఐటీ కళాశాలలో బీటెక్ (సీఎస్ఈ) మూడో సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో గత నెల 30న చైతన్యపురి పోలీస్స్టేషన్లో కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్న బి. శ్రీకాంత్రెడ్డితో పల్లవికి వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**వివాహం అనంతరం వేధింపుల ఆరోపణలు**

వివాహం జరిగిన కొద్దిరోజులకే అదనపు కట్నం కోసం తన కుమార్తెను భర్త శారీరకంగా, మానసికంగా వేధించాడని మృతురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. వివాహం అనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో పల్లవి తీవ్ర ఆందోళనకు గురైనట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ కుమార్తె ఎదుర్కొన్న పరిస్థితులపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**కళాశాలలో తీవ్ర కలకలం**

ఈ క్రమంలో సెప్టెంబర్ 18న పల్లవి కళాశాలకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆ రోజు ఆమె తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు సమాచారం. సాయంత్రం కళాశాల కార్యకలాపాలు ముగిసిన అనంతరం చోటుచేసుకున్న ఘటనతో కళాశాల ప్రాంగణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. విషయం తెలుసుకున్న కళాశాల సిబ్బంది వెంటనే స్పందించి పల్లవిని చికిత్స నిమిత్తం మేడిపల్లిలోని శ్రీకర ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రిలో వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఆమె పరిస్థితి విషమించడంతో రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పల్లవి మృతిచెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చదువుకుంటూ మంచి భవిష్యత్తు కోసం ఎదురు చూస్తున్న



కుమార్తె ఇలా మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు**

మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఘట్కేసర్ పోలీసులు వరకట్న వేధింపులు, వరకట్న మరణానికి సంబంధించిన అంశాలపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. వివాహం అనంతరం పల్లవి ఎదుర్కొన్న పరిస్థితులు, కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు, ఘటనకు దారితీసిన కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

పల్లవి వివాహానికి సంబంధించిన వివరాలు, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

వివాహం జరిగిన కొద్దిరోజులకే బీటెక్ విద్యార్థిని మృతి చెందడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు...

## టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీని పరామర్శించిన కవిత

57 58

------------------------------------





ఇటీవల తల్లిని కోల్పోయిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే ) రాష్ట్ర అధ్యక్షులు కె విరాహత్ అలీని మౌలాలి ఎంజే కాలనీ లోని ఆయన నివాసంలో టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట కవిత ఆ పార్టీ నాయకులు పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి విరాహత్ అలీ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. తల్లిని కోల్పోయి బాధలో ఉన్న అతనికి దేవుడు మనోధైర్యం ఇవ్వాలని కోరుతున్నట్లు కవిత పేర్కొన్నారు=

# దేవర బాలాజీ స్థలంలో అక్రమ నిర్మాణాలా?

**సర్వే నంబర్ 465లో అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణం?**

**నిబంధనలు గాలికి.. చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం**

**ముడుపులు ముట్టాయనే ఆరోపణలు.. సమగ్ర విచారణ కోరుతున్న స్థానికులు**



ఘట్కేసర్ మనం న్యూస్ సెప్టెంబర్ 19: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ పట్టణంలో ఎండోమెంట్ స్థలాల పరిరక్షణపై అధికారుల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న దేవర బాలాజీ స్థలానికి సంబంధించిన సర్వే నంబర్ 465లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందకుండానే నిర్మాణ పనులు జరుగుతున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రధాన ప్రాంతంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? భవన నిర్మాణ ప్రణాళికకు ఆమోదం లభించిందా? స్థల వినియోగానికి సంబంధించి ఏవైనా ప్రత్యేక అనుమతులు ఉన్నాయా? అన్న విషయాలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

**అనుమతులు ఉన్నాయా.. లేవా?**

ఎండోమెంట్ స్థలానికి సంబంధించిన భూమిలో నిర్మాణాలు చేపట్టే విషయంలో సంబంధిత నిబంధనలు, భూమి హక్కులు, స్థల వినియోగం, భవన నిర్మాణ అనుమతులు తదితర అంశాలు కీలకంగా ఉంటాయి. అయితే సర్వే నంబర్ 465లో కొనసాగుతున్నట్లు చెబుతున్న నిర్మాణానికి సంబంధించి పూర్తి స్థాయి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

నిర్మాణం బహుళ అంతస్తుల స్థాయికి చేరుతున్న సమయంలోనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ముడుపుల ఆరోపణలపై సమగ్ర విచారణ**

ఈ నిర్మాణ వ్యవహారంలో పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి వాస్తవాలు ఏమిటన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

ఎవరైనా అధికారుల ప్రమేయం ఉందా? నిర్మాణదారులకు ఎవరైనా సహకరిస్తున్నారా? సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఎలా లభించాయి? లేక అనుమతులు లేకుండానే పనులు కొనసాగుతున్నాయా? వంటి అంశాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే సంబంధిత అధికారులు వాస్తవాలను ప్రజలకు వెల్లడించి అనుమానాలకు తెరదించాలని వారు కోరుతున్నారు.

**అధికారుల మౌనంపై ప్రశ్నలు**

నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తున్నాయి. సాధారణ నిర్మాణాల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్న అధికారులు, ఎండోమెంట్ స్థలంగా పేర్కొంటున్న ఈ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాలపై కూడా అదే స్థాయిలో పర్యవేక్షణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే పనులు కొనసాగుతున్న దశలోనే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపితే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని ప్రజలు అంటున్నారు.

**రికార్డులు బయటపెట్టాలని డిమాండ్**

సర్వే నంబర్ 465కు సంబంధించిన భూమి హక్కులు, ఎండోమెంట్ రికార్డులు, స్థల వినియోగం, నిర్మాణ అనుమతులు, భవన ప్రణాళిక, సంబంధిత శాఖల నుంచి పొందిన అనుమతులు తదితర వివరాలను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

అవసరమైతే సంబంధిత రికార్డులను బహిర్గతం చేసి ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థలం ఎండోమెంట్ పరిధిలో ఉంటే దాని పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఉన్నతాధికారుల తనిఖీలు ఎప్పుడు?**

ఘట్కేసర్ పట్టణంలో ప్రధాన ప్రాంతంలోనే ఈ తరహా ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 465లో జరుగుతున్న నిర్మాణాలను సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి, అనుమతుల పరిస్థితిని స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులను నిలిపివేసే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అన్ని అనుమతులు ఉన్నట్లయితే వాటి వివరాలను ప్రజలకు వెల్లడించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**చోద్యం చూస్తున్నారెందుకు?**

ప్రభుత్వ, ఎండోమెంట్ స్థలాల పరిరక్షణలో అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని, ప్రారంభ దశలోనే నిబంధనలను పరిశీలించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

సర్వే నంబర్ 465లో అసలు ఏం జరుగుతోంది? నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయా? ఎండోమెంట్ స్థల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా? ముడుపుల ఆరోపణల్లో వాస్తవమెంత? అనే ప్రశ్నలకు ఉన్నతాధికారుల విచారణతోనే సమాధానం లభించాల్సి ఉంది.

ప్రస్తుతం ఈ వ్యవహారంపై స్థానికుల్లో చర్చ కొనసాగుతుండగా, సంబంధిత అధికారులు ఎప్పుడు స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది...

# ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

**ముగ్గురు మృతి**




మేడ్చల్, సెప్టెంబర్ 19 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా శామీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కీసర శామీర్పేట్ ఓఆర్ఆర్ పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. శామీర్పేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాచారం కు చెందిన అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ టైర్ పంచర్ కావడంతో వాహనాన్ని ఓ ఆర్ ఆర్ పక్కన నిలిపి టైరు మార్చే పనిలో ఉన్నారు. అదే సమయంలో వెనుక నుండి దూసుకొచ్చిన ట్రక్కు మినీ వ్యాన్ ను ఢీ కొట్టింది.ఈ ఘటనలో వ్యాను పూర్తిగా ధ్వంసం కాగా, వ్యాన్ వద్దనే ఉన్న నాచారం కు చెందిన రింకు, ఇస్మాయిల్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ ఇబ్రహీం ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న షామీర్పేట్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. శామీర్పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గణనాథుని ఆశీస్సులు పొందిన ప్రజాప్రతినిధులు, భక్తులు

**స్థానిక కౌన్సిలర్ దావల్లరి గోపాల్ రెడ్డి అన్నప్రసాద వితరణలో పాల్గొన్న బిజెపి నాయకులు**



చేవెళ్ల, సెప్టెంబర్ 19(మనం న్యూస్): చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పామెన 8వ వార్డులో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో ఆరవ రోజు పూజా కార్యక్రమాలు శనివారం నాడు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా.... స్థానిక కౌన్సిలర్ ధవల్లారి గోపాలరెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెలి అనంతరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. వైభవరెడ్డి ప్రత్యేక అతిథులుగా హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని పంపిణీ చేశారు. గణేష్ ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మోహన్ కృష్ణ, రవికుమార్, వెంకటేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దళితులను మోసం చేసిన బీఆర్ఎస్: హెచ్ఆర్ మోహన్

**దళితులకు రాజకీయ, సామాజిక గౌరవం కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..**
**రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు..**
**స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు జరిగిన అవమానం బాధాకరం..**




నాచారం, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బీఆర్ఎస్ మోసం చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి హెచ్ఆర్ మోహన్ ఆరోపించారు. నాచారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో డిప్యూటీ సీఎం, మంత్రి పదవుల విషయంలో రాజయ్య, కడియం శ్రీహరి తదితర దళిత నేతలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులకు రాజకీయంగా ప్రాధాన్యత లభిస్తోందని హెచ్ఆర్ మోహన్ అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు కీలక బాధ్యతలు అప్పగించడం సామాజిక గౌరవానికి నిదర్శనమన్నారు.

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసినట్లు వచ్చిన వ్యాఖ్యలు వివాదానికి దారితీసిన నేపథ్యంలో, రాజ్యాంగబద్ధమైన పదవులను గౌరవించాలని సూచించారు. ఈ వ్యవహారంపై తాతా మధు తాను స్పీకర్ను ఉద్దేశించి మాట్లాడలేదని వివరణ ఇచ్చిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. ఎర్రవల్లి ఫామ్హౌస్ వద్ద దళితులు నిరసన చేపట్టిన అనంతరం పసుపు నీళ్లతో ప్రదేశాన్ని శుద్ధి చేశారంటూ వచ్చిన ఆరోపణలను హెచ్ఆర్ మోహన్ ప్రస్తావించారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎర్రవల్లిలో ప్రభుత్వ భూముల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. దళితులకు రాజకీయ పదవులతో పాటు ఐఏఎస్, ఉన్నత విద్య, విశ్వవిద్యాలయాల్లో అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దళితులకు ఆత్మగౌరవమే ముఖ్యమని, తమ సమాజం కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటుందని హెచ్ఆర్ మోహన్ పేర్కొన్నారు. దళితుల సమస్యలు, హక్కుల కోసం రాజ్యాంగబద్ధంగా పోరాడాలని పిలుపునిచ్చారు.



## ఓయూ ఆర్ట్స్ కాలేజీలో విద్యార్థి జన సమితి హెల్ప్ డెస్క్

**నూతన విద్యార్థుల అడ్మిషన్ సమస్యల పరిష్కారానికి సహాయం..**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో నూతన విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి టీజేఎస్ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థి జన సమితి (విజేఎస్) హెల్ప్డెస్క్ నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు కడారి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా విద్యార్థులకు అడ్మిషన్ ప్రక్రియపై అవసరమైన సమాచారం, సహాయం అందించారు. సర్టిఫికెట్ల సమర్పణ, కౌన్సెలింగ్, కోర్సుల ఎంపిక, ఫీజులు తదితర అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అడ్మిషన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఇలాంటి సహాయక కార్యక్రమాలను కొనసాగిస్తామని రమేష్ యాదవ్ పేర్కొన్నారు. విద్యార్థుల హక్కులు, సమస్యలపై నిరంతరం అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మల్లాపూర్‌లో వైభవంగా వినాయక చవితి వేడుకలు





**ఏకదంతా వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఘనంగా మహా అన్నదానం..**

నాచారం, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) మల్లాపూర్ పరిధిలోని ఏకదంతా వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో, అధ్యక్షుడు అచ్చగొని దినేష్ గౌడ్ నేతృత్వంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. తొలి రోజు నుంచే స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, సహస్రనామార్చనలు నిర్వహిస్తున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తూ భక్తులు గణనాథుడిని దర్శించుకుంటున్నారు. వేడుకల్లో భాగంగా మండప ప్రాంగణంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి మల్లాపూర్ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గణనాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పలువురు స్థానిక నాయకులు, ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అచ్చగొని దినేష్ గౌడ్ మాట్లాడుతూ, లంబోదరుని దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులందరూ కలసికట్టుగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. మండప ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలు, ఆధ్యాత్మిక గీతాలతో మారుమోగుతోంది. మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భరత్, సందీప్, చరణ్, పృథ్వి, నీలేష్, సునీల్, ఆశిష్, అంచల్, వెంకటేష్, లక్కీతో పాటు పలువురు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో 'సురక్షా సంకల్ప్-2026' పై అవగాహన

**మహిళా భద్రత, సైబర్ నేరాలపై సీపీ అవగాహన..**
**డ్రగ్స్, రోడ్డు, ఆహార భద్రతపై ఐదు సూత్రాల సందేశం..**



సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) ఆర్టీసీ కాలనీలోని గణేష్ మండపం వద్ద 'గణేష్ సురక్షా సంకల్ప్-2026' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి సీపీ సుమతి హాజరై భక్తులు, మహిళా నిర్వాహకులతో మాట్లాడారు. మహిళా భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ దుర్వినియోగం, రోడ్డు భద్రత, ఆహార భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంచి సమాజ నిర్మాణానికి ఈ ఐదు అంశాలపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు రేణుక, సహచరి సుకన్య తదితరులు సీపీని కలిసి కార్యక్రమ వివరాలను తెలియజేశారు. అధికారులు భక్తులు, నిర్వాహకులతో మాట్లాడి భద్రతా చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్, రోడ్డు సేఫ్టీ డీసీపీ లక్ష్మి, డీసీపీ ఎస్ బి నరసింహారెడ్డి, తిరుమలగిరి ఏసీపీ జి. రమేష్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సింగిరెడ్డి మాధవ రెడ్డి వర్ధంతి వేడుకలు

మేడ్చల్, సెప్టెంబర్ 19: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ సర్కిల్ గుల్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవెళ్ళి లో స్వాతంత్ర్య సమర యోధులు,తెలంగాణ తొలి దశ ఉద్యమ నాయకులు సింగిరెడ్డి మాధవ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు,తెలంగాణ తొలి దశ ఉద్యమకారులు సింగిరెడ్డి మాధవ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధి గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలోని మాధవరెడ్డి చౌరస్తా వద్దగల విగ్రహం వద్ద మాధవ రెడ్డి కుమారుడు,టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి,మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులతో కలిసి పాల్గొని మాధవ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ మాధవ రెడ్డి చిరస్మరణీయుడని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అత్యంత సుపరిచితులని పేర్కొన్నారు తెలంగాణ తొలి దేశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నార ని, ఈ ప్రాంతానికి ఒక పెద్దదిక్కుగా అందరి నోట్లో నాలుకగా మెలిగారన్నారు మాజీ మంత్రి ఉమా వెంకట్రామిరెడ్డి ,మాధవ రెడ్డి ఈ ప్రాంత




ప్రతిష్టను మరింత ఎత్తుకు తీసుకువెళ్లారని మాధవ రెడ్డి వారసునిగా హరి వర్ధన్ రెడ్డి జిల్లా,రాష్ట్ర రాజకీయాలలో తనదైన ముద్ర వేశారని తెలిపారు.మాధవ రెడ్డి వలే హరి వర్ధన్ రెడ్డి కూడా నీతి నిజాయితీతో కూడిన రాజకీయాలను చేస్తున్నారని

స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న చరిత్ర కూడా మాధవ రెడ్డి ఉందన్నారు. మాధవ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే వారి వారసులుగా మనందరి కర్తవ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు)ముదిరాజ్ తో పాటు,కిష్టాపూర్ పూడూర్ 298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,గుండ్ల పోచంపల్లి



డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్,ఎల్లంపేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రేగు రాజు కురుమ,దుర్గం శివ శంకర్ ముదిరాజ్,మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్ కురుమ,కౌడే మహేష్ కురుమ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల మహేష్ గౌడ్,కనకాల శివ కుమార్ (బిపిటి రాజు),గువ్వ రవి ముదిరాజ్,వేముల శ్రీనివాస్ రెడ్డి,ఉదండపురం సత్యనారాయణ, రామన్నగారి సంతోష్ గౌడ్,చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్,రఘుపతి రెడ్డి,చంద్రయ్య గౌడ్,గణేష్,ముక్తార్, రెడ్డి సంఘ అధ్యక్షులు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చేవెళ్లలో రైతులకు తెల్ల కుసుమ విత్తనాలు పంపిణి

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడి**

**రైతుల సమస్య పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా: ఎమ్మెల్యే**

చేవెళ్ల, సెప్టెంబర్ 19(మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల, శంకర్పల్లి మండలాలకు సంబంధించిన రైతులకు తెల్ల కుసుమ విత్తనాలను స్థానిక ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా..... ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ......రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను

వినియోగించుకుని రైతులు మంచి దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు మరియు ఇతర వ్యవసాయ సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తన దృష్టికి తీసుకురావాలని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్స్ శైలజ ఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కో- ఆప్షన్ సభ్యులు,మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య,సీనియర్ నాయకులు చింటూ, వేరేందర్ రెడ్డి,రాములు,టేకుల పల్లి శ్రీనివాస్,రాహులపల్లి శ్రీనివాస్, ఎల్లయ్య, ల్యాకత్,పాండు, అధికారులు, రైతులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# స్కేటింగ్ పోటీల్లో భారతీయ విద్యా భవన్ విద్యార్థుల సత్తా

**70వ తెలంగాణ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ స్కేటింగ్ కాంపిటీషన్లో పతకాల పంట..**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భారతీయ విద్యా భవన్ స్కూల్ ప్రిన్సిపల్ అరుణశ్రీ అన్నారు. 70వ తెలంగాణ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ స్కేటింగ్ కాంపిటీషన్లో భారతీయ విద్యా భవన్ జూబ్లీహిల్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి వివిధ కేటగిరీల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను సాధించారు.




ప్రియాన్ని గోల్డ్, సిల్వర్, విహాన్ గోల్డ్, సిల్వర్, సుమిత్ గుణ కౌశిక్ బ్రాంజ్ పతకాలు సాధించారు. అశ్వి అరవింద్ ఒక గోల్డ్, రెండు సిల్వర్ పతకాలు గెలుచుకుంది. అండర్-11లో దినేష్ గోల్డ్, సిల్వర్, వేదిత ఒక గోల్డ్, రెండు సిల్వర్ పతకాలు సాధించారు. ఒకే విద్యార్థి మూడు పతకాలు సాధించడం గర్వకారణమని ప్రిన్సిపల్ అరుణశ్రీ పేర్కొన్నారు. స్కూల్లో నిర్వహించిన అభినందన సభలో పతకాలు సాధించిన విద్యార్థులను ఘనంగా

అండర్-17 కేటగిరీలో చిట్టా లోకేశ్వర్ గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించగా, ఆర్. కుషాల్ రెండు సిల్వర్, ఒక బ్రాంజ్ పతకం గెలుచుకున్నాడు. శ్వేత అండర్-17 క్వాడ్ విభాగంలో సిల్వర్ పతకం సాధించింది. అండర్-14లో

సత్కరించారు. విద్యార్థులకు శిక్షణ అందించిన కోచ్ గండి రాజును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

# ప్రజా పాలనపై ప్రభుత్వం దృష్టి సారించాలి

**అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయి: డా. ఎన్. అశోక్..**




సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) తెలంగాణలో ప్రజా పాలన గాడి తప్పిందని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ ఆరోపించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలు, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించకుండా పాలనను గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షం సైతం ప్రజల సమస్యలపై పోరాడకుండా ఆధిపత్య రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు శాఖల్లో పనులు ముందుకు సాగడం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డాక్టర్ అశోక్ అన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర రాజకీయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో పరిస్థితులపై గవర్నర్ చొరవ తీసుకుని రాష్ట్రపతి పాలన విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు.



# గణపతి మండపాన్ని సందర్శించిన దిల్ రాజు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) సికింద్రాబాద్ మోండా మార్కెట్ లోని టకార బస్తీ లో సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ కుటుంబం ఏర్పాటు చేసిన 'అశోక యువజన సంఘం' మహా గణపతి విగ్రహాన్ని ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మారావు గౌడ్ నిర్వహించే వినాయక ఉత్సవాలు విభిన్నంగా నిలిచి భక్తులను ఆకట్టుకుంటాయని దిల్ రాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు. విభిన్న ఉత్సవాలు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల సంస్కృతికి దర్పణంగా నిలుస్తాయని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. యువ నేత కిశోర్ కుమార్ తదితరులతో పాటు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్తమ బోధనకు ఉత్తమ గౌరవం..

## షాబాద్‌కు చెందిన 16 మంది ఉపాధ్యాయులకు సత్కారం



మనం న్యూస్ // షాబాద్, సెప్టెంబర్ 20: షాబాద్ మండలానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 11 మంది, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఐదుగురు ఉపాధ్యాయులను శనివారం సన్మానించారు. మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఉపాధ్యాయులను సత్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షాబాద్ మండలం నుంచి 11 మంది మండల స్థాయి, ఐదుగురు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్య బోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లోనూ ప్రోత్సాహం అందించి వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో మరెందరో





ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

### సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి

కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ తాళ్లపల్లి, కేజీబీవీ షాబాద్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు వివిధ కళారూపాలను ప్రదర్శించి అతిథులను, సభకు హాజరైన వారిని ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభను పలువురు అభినందించారు.

### మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు:

బడుగుల రమాదేవి, ఎల్. భ్రమరాంబ దేవి, కె. అనురాధ, ఎం. బాలకృష్ణ, ఎన్. ఉమాదేవి, డి. షరీఫా, బషీర్ జహాన్, ఎన్. సమత, కె. రమేశ్వరి, సిహెచ్. శ్రీలక్ష్మి, ఏ. గోవర్ధన్.

### జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు:

ఎల్. అంబర్ సింగ్, ఏ. లలిత, ఎం. సుజాత, బి. మాధవ రెడ్డి, బి. కృష్ణయ్య.

కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, షాబాద్ సర్పంచ్ అశోక్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఇండియా పోస్ట్ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

### ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే



మేడ్చల్, సెప్టెంబర్ 19: ( మనం జిల్లా ప్రతినిధి): సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవల్లి వార్డ్ కార్యాలయంలోఈరోజు భారత తపాలా శాఖ (ఇండియా పోస్ట్ ) మేడ్చల్ సబ్ పోస్ట్ మాస్టర్ సౌజన్య, గౌడవల్లి పోస్ట్ మాస్టర్ బాబురావు ఆధ్వర్యంలో ₹దాక కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (డీసీడీపీ ) - ఇండియా పోస్ట్ : బ్రింగ్ గవర్నమెంట్ టు యువర్ దూరస్టెప్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడవల్లి మాజీ సర్పంచ్, గుండ్ల పోచంపల్లి డివిజన్ ప్రెసిడెంట్ గరిసెల సురేందర్ ముదిరాజ్ , మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా తపాల శాఖ అసిస్టెంట్ సూపర్డెంట్ సంపత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామంలోని వృద్ధులు, మహిళలు, రైతులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

పి ఎల్ ఐ ముఖ్య ప్రయోజనాలు

- తక్కువ ప్రీమియంతో అధిక రక్షణ
- ప్రభుత్వ భరోసా గల విశ్వసనీయ భీమా పథకం
- ఆకర్షణీయమైన బోనస్ ప్రయోజనాలు
- కుటుంబానికి ఆర్థిక భద్రత
- చిన్న పొదుపు - పెద్ద భద్రత, పిల్లల విద్య, పెళ్లి, భవిష్యత్ లక్ష్యాల కోసం ఉపయోగపడుతుంది అనంతరం మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ డీసీడీపీ కార్యక్రమం ద్వారా పోస్టల్ సేవలు, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవలు నేరుగా గ్రామాల్లోని ప్రజల ఇంటి వద్దకే వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో తపాలా శాఖ పాత్ర ఎంతో కీలకమని అన్నారు.ఈ కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు, స్థానిక నాయకులు, మాజీ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# నాచారంలో ఆకట్టుకుంటున్న పర్యావరణహిత గణనాథుడు

### ఇస్తారాకు కప్పులతో 15 అడుగుల వినాయకుడు..

### 17 ఏళ్లుగా వినూత్న విగ్రహాల తయారీ..



నాచారం, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) వినాయక చవితి సందర్భంగా నాచారం పరిధిలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. బాబానగర్లోని సూర్య శుభకర విఘ్న వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 అడుగుల ఎత్తైన పర్యావరణహిత వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసి ప్రతిష్ఠించారు. సుమారు వెయ్యి ఇస్తారాకు కప్పులతో రూపొందించిన ఈ విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా కళాకారుడు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా తామే స్వయంగా పర్యావరణహిత వినాయక విగ్రహాలను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో పేపర్ స్ట్రాలు, రూబిక్స్ క్యూబ్స్, చెక్క స్టిక్స్, మట్టి ప్రమిదలు, పేపర్ టీ కప్పులు, బిస్కెట్ కోన్స్, దారం, న్యూస్ పేపర్లతో వినూత్న విగ్రహాలను రూపొందించినట్లు చెప్పారు. చంద్రయాన్ స్ఫూర్తితోనూ ప్రత్యేక థీమ్తో విగ్రహాన్ని తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఉత్సవాల అనంతరం పర్యావరణహిత పద్ధతిలో వైభవంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# హోప్ ఫౌండేషన్ చరిత్ర

### నిర్విరామంగా కొనసాగుతన్న అన్నదానం

మనం న్యూస్ // మియాపూర్, సెప్టెంబర్ 19: చందానగర్ హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ అన్న ఆధ్వర్యంలో గత 202 వారాలుగా అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుండటం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

రోజూ ఆకలితో అలమటించే వందలాది మంది నిరుపేదలు, వృద్ధులు, వలస కూలీలకు కడుపునిండా అన్నం పెడుతూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా అందరికీ అన్నం పెట్టడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. ఈ సందర్భంగా కొండా విజయ్ కుమార్ అన్న మాట్లాడుతూ. సేవే మా లక్ష్యం, ఆకలి అన్న మాట లేకుండా చేయడమే హోప్ ఫౌండేషన్ ఆశయం, గత 202 వారాలు పూర్తి చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది, దీనికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలో మేడ్చల్ యువతికి కాంస్యం

మేడ్చల్, సెప్టెంబర్ 19 ( మనం జిల్లా ప్రతినిధి ): పాండిచ్చేరి లో ఈనెల 16 వ నిర్వహించిన సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్ సర్కిల్ అత్వెల్లి కి చెందిన యువతి కాంస్యం పధకం సాధించింది. అండర్-18 విభాగంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించిన మండల స్నేహ రాజ్ గోపాల్ పో ల్లో పాల్గొని లాంగ్ జంప్ లో కాంస్యం పతకాన్ని సాధించారు. సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో తోమ్మిది రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా లాంగ్ జంప్ రాష్ట్రంకు స్నేహ కాంస్య పతకం ను సాధించి పెట్టారు. పతకం సాధించిన స్నేహ ను మేడ్చల్ లో పలువురు అభినంధించారు.

